

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 185 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 05, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్









డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# ప్రాంతీయ వాదం.. పగరాజేస్తుంది!

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

నీతిమాలిన రాజకీయాల ముసుగులో రాజకీయ నాయకులు పాతకక్షలను రెచ్చగొడుతున్నారని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా పరిగణించారు. రాజకీయాలను రాజకీయాల లాగా మాత్రమే చూడాలని ప్రాంతాలను విభేదించి పాలించాలనే ఆలోచన ఏ రాజకీయ నాయకునికి రాకూడదన్నారు. స్థానికతను పక్కనపెట్టి వేరే ప్రాంతాలపై ప్రేమానురాగాలు చూపిస్తామని ప్రలోభాలు పెడుతున్న రాజకీయ నాయకులు రాజకీయ జీవితంలో నిజాయితీని పాటించడం లేదని అర్థం చేసుకోవాలన్నారు. కేవలం తెలంగాణ ప్రాంతం పైనే ప్రతి రాజకీయ నాయకుని రాజకీయ జీవితం ఆధార పడ్డట్లుగా ప్రవర్తిస్తుండడం తెలంగాణ ప్రాంతంపై ప్రేమ కలిగి ఉన్నట్లా రాజకీయ ఆంక్షలు కలిగి ఉన్నట్లా రాజకీయ

- మిగతా 2లో..

కక్ష సాధింపులను ప్రేరేపిస్తుంది

- అభివృద్ధి ముసుగులో అంతరింపజేస్తుంది
- నాయకుల స్వార్థం మధ్య నలిగిపోతుంది
- సొంత స్థానికత కన్నా పక్క స్థానికతపై పోరాడుతామంటున్నారు
- ఢిల్లీ పీఠం కదిలితే గాని ప్రాంతాల మధ్య గొడవలు చల్లారావు
- తెలంగాణను విచ్ఛిన్నం చేసే కుట్రలు విపరీతంగా పెరిగిపోతున్నాయి
- ఇంకేం సాధిద్దామని... తెలంగాణను బలిగొనాలనుకుంటున్నారు
- ఎవరి ప్రాంతాన్ని వాళ్లు అభివృద్ధి చేసుకోక ఏంటి ఈ మధ్యస్థ గొడవలు
- యువతను పోరంబోకోల్లులాగా చేస్తున్న నాయకులు
- ప్రాంతాలపై కక్షలు పెంచకండి
- గట్టిగా పోరాడే రాష్ట్రాలపై పోట్లాటలు పెడుతున్నారు
- ప్రాంతీయవాదం ప్రజల ప్రాణాలను బలిగొంటుంది : డాక్టర్ బరిగెల శివ






## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన

త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



2

## ప్రముఖ యూట్యూబర్, ‘నందూస్ వరల్డ్’ ఛానల్ నిర్వాహకురాలు

యూకేలో ఉద్యోగాల పేరుతో భారీగా వసూళ్లు.. ‘నందూస్ వరల్డ్’ దంపతులపై కేసు.. ‘విమెన్’ విక్టిమ్ కార్డు



3

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

2

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

వర్షాభావంపై సన్నద్ధం చేయండి
వ్యవసాయాధికారులకు
మంత్రి తుమ్మల సూచన



6



## ప్రజా సేవలో పదునైన దూకుడు నాయిని సొంతం

- ప్రజా అభిమానాన్ని చూరగొంటున్న నాయిని
- ప్రజా సేవకు సుపరిచితుడు
- ఎమ్మెల్యే నాయిని ప్రజా సేవకు కట్టుబడి ఉన్నారు
- ప్రజా కార్యక్రమాలలో పరిణితి చెందుతున్న ప్రావీణ్యుడు
- ప్రభుత్వ నిధులను హనుమకొండ వైపు మళ్ళిస్తున్నాడు
- ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం పరితపిస్తున్నారు
- అభివృద్ధి పనుల్లో అడుగడుగు దూసుకుపోతున్నారు
- ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక కలయికలో జై భీమ్ చైర్మన్ ను సన్మానించిన నాయిని

3

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

**ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన**
**త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**





**నారాయణపేట,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ÷ాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

# సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

**మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు**
**సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు**

**న్యూఢిల్లీ,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

# టూ వీలర్ స్కిడ్.. దూసుకెళ్లిన బస్సు

**ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం**

**హైదరాబాద్,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఇదే ఓ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సికింద్రాబాద్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కురిసిన వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఓ యువకుడు స్కిడ్ అయి.. అదే సమయంలో పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయాడు. బస్సు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మార్కెట్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురునానక్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మదన్ మోహన్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మదన్ మోహన్ అకాల మరణంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# ప్రాంతీయ "వాదం"పగరాజేస్తుంది

మొదటి పేజీ తరువాయి



స్వార్థం కలిగి ఉన్నట్లు ఎటు తేల్చుకోలేని పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు.తెలంగాణ ప్రాంతంపై కేంద్ర ప్రభుత్వ కుట్రలు తెలంగాణ ప్రాంతంపై స్పష్టంగా కనిపిస్తున్నాయని అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం నాయకులను తెలంగాణ ప్రాంతం పై కపట ప్రేమ చూపిస్తున్నట్లుగా నటించే విధంగా రాజకీయ ప్రలోభాలకు రెచ్చగొడుతున్నారని తెలిపారు.తెలంగాణ ప్రాంతంలో అనుభవజ్ఞులైన బిజెపి నాయకులు ఈటల రాజేందర్,బండి సంజయ్,ధర్మపురి అరవింద్, కిషన్ రెడ్డి,రఘునందన్ రావు లాంటి ప్రధాన నాయకులు ఉన్నప్పటికిని పక్క రాష్ట్రాల నాయకులైన చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ లాంటి నాయకులను తెలంగాణ ప్రజల ఆకర్షణార్థం సభలు సమావేశాలు పెట్టుకొనుటకు ప్రేరేపిస్తూ తెలంగాణ ప్రాంతంలో కేంద్రం ప్రలోభాలను బలపరిచే విధంగా ప్రయోగాలు చేయడం రాజకీయ వ్యతిరేకులు చేసే పని అన్నారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇటు బిజెపి నాయకులను అటు బీఆర్ఎస్ నాయకులను సమర్ధవంతంగా ఎదుర్కొంటూ తెలంగాణ రాష్ట్రాన్ని పాలిస్తుండగా మరోవైపు చంద్రబాబులాంటి నాయకుడు తెలంగాణపై కుట్రలు చేస్తున్నాడని కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలో తెలంగాణ నేతల హస్తం ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారని తెలిపారు.ఎప్పుడో విడిపోయిన ప్రాంతాలలోని ప్రజల మధ్య రాగద్వేషాలు రెచ్చగొడుతూ, ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ హైదరాబాదులో స్థానికంగా ఉన్నటువంటి ఆంధ్ర ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నాలు కూటమి ప్రభుత్వ నాయకులు చేస్తుండడం సరికాదన్నారు.సుఖ సంతోషాలతో జీవిస్తున్న ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ పార్టీల స్వార్థాలను ప్రజలకు అంటగట్టాలని చూడడం ఏ మాత్రం మంచిది కాదని పేర్కొన్నారు.12 సంవత్సరాలుగా లేనిది ఉన్నపాటుగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రవేశించబోతుందని తెలియగానే కూటమినేతలు కూడబెట్టుకొని తెలంగాణపై చొరబాటుదారుల వలె సమావేశాలు పెడతామని ముందుకు రావడం రాజకీయ కుట్రలో భాగమన్నారు.సంపూర్ణంగా విడిపోయిన ప్రజల మధ్య ప్రాంతాల గొడవలను రెచ్చగొడుతూ సున్నితంగా ఉన్న ప్రాంతాలపై సునామిలాంటి అల్లర్లను రేపాలని చూడడం కూటమి నాయకులకు కొత్తేమికాదన్నారు.1948లో మొదలైన తెలంగాణ అణిచివేత నేటికీ కొనసాగుతూనే ఉందని స్వరాష్ట్రం ఏర్పడి పట్టడంత అభివృద్ధి చేసుకోవాలని తెలంగాణ ప్రాంత నేతలు ప్రయాస పడుతుంటే అంతలోనే ఆంధ్రా నాయకుల పెత్తనం చెలరేగిపోతుందని అన్నారు.

**నాయకుల వైఫల్యం నాణ్యత లేని పాలన..**

రాజకీయ వైఫల్యాలతో కొట్టుమిట్టాడుతూ అధికార పదవుల్లో కొనసాగుతున్న ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాలకు చెడ్డ పేరును తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.తెలంగాణ ప్రాంత నాయకులు ఆంధ్రప్రదేశ్లో గాని ఇతర రాష్ట్రాల్లో గాని ప్రలోభాలకు గురి చేసే రాజకీయ ప్రయత్నాలు ఏమాత్రం చేయడం లేదని తెలుపుతూ ఆంధ్ర పాలకులు మాత్రం తెలంగాణ కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూటమి ప్రభావాలను ప్రేరేపింపజేస్తూ ప్రజలను విభాగించి పరిపాలించాలని చూస్తున్నారన్నారు.తెలంగాణ వాదం తెలంగాణ ప్రాంతం పరాయోడి పెత్తనాన్ని చూస్తూ ఊరుకునే ప్రాంతం కాదని ప్రాంతీయేతరుల కుట్రలను ఎలా చేదించాలో ఎలా ఎదురు తిప్పి కొట్టాలో తెలంగాణ ప్రజలకు తెలిసినంతగా దేశవ్యాప్తంగా ఎవరికి తెలియదని ప్రత్యక్షంగా హెచ్చరించారు.కష్టపడి సాధించుకున్న తెలంగాణలో తెలంగాణ ప్రజల్ని సుఖంగా బ్రతకనివ్వడం లేదని తెలంగాణ ప్రాంతంలోని నాయకులు తెలంగాణ ప్రాంతీయేతరులతో చేతులు కలిపి తెలంగాణ ప్రాంతంపై విభిన్నమైన రాజకీయాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు.తెలంగాణ ప్రాంతంపై బీజేపీ కన్ను పడిందంటూ తెలంగాణ అభివృద్ధి బిజెపితోనే సాధ్యమంటూ కసాయి మాటలు మాట్లాడుతున్న నాయకులంతా 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ తెలంగాణ ప్రాంతానికి చేసిన అభివృద్ధిని ఇచ్చిన నిధులను ప్రస్తావించమంటే మాట మాట్లాడడం లేదని దాంతోపాటు తెలంగాణ రాష్ట్రం నుండి 12 సంవత్సరాలుగా సంవత్సరానికి లక్ష కోట్ల చొప్పున 12 లక్షల కోట్ల రూపాయలను తీసుకున్నదన్న సంగతిని తెలంగాణ, తెలంగాణేతర బిజెపి నాయకులు పసిఘట్టాలన్నారు.స్వతహాగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రంపై ప్రాంతీయేతర నాయకులు తెలంగాణపై రాజకీయ దాడులకు పాల్పడుతూనే ఉన్నారని హెచ్చరించారు.

**పాత కక్షలు ప్రాంతాలకు ముప్పు..**

తెలంగాణ ప్రాంతం స్వతహాగా అభివృద్ధి చెందాల్సిన సమయంలో కేంద్రంలోని బిజెపి నేతలు ఇతర రాష్ట్రాల్లోని వ్యాపారస్తులు పక్క రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీ నాయకులు ఒక్కసారిగా తెలంగాణలోని ప్రాంతీయ విభేదాలు రెచ్చగొడుతూ పాతకక్షలను ప్రేరేపిస్తున్నారని అవన్నీ తెలంగాణ ప్రాంతంపై తీవ్రమైన ప్రభావాన్ని తీసుకొచ్చే ప్రమాదం ఉందని గుర్తు చేశారు.12 ఏళ్లుగా హైదరాబాద్ ప్రాంతం ఎంతో అభివృద్ధికి నోచుకుందని స్వయంగా ప్రపంచ దేశాలు హైదరాబాద్ సుందరీకరణపై ఎంతో మమకారాన్ని పెంచుకుంటున్నారని గుర్తు చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఉన్న హైదరాబాద్ ప్రాంతానికి తెలంగాణ సొంతమై ఉన్నటువంటి హైదరాబాద్ ప్రాంతానికి ఎంతో వ్యత్యాసం ఉందని గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూపంలో కేంద్రం కంటపడకుండా హైదరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోగలిగినామని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో హైదరాబాద్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే పనిలో నిమగ్నమైనరని తెలంగాణ ప్రజలు భావిస్తుండగా అసలైన విషయాన్ని గమనించాల్సిన ప్రజలు హైదరాబాద్ ప్రాంతంలో తెలంగాణ ప్రాంత ప్రజల కన్నా ప్రాంతీయేతరుల నివాసాలే ఎక్కువగా ఉన్నాయని అయినప్పటికిని తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ ప్రాంతం అనేది గుండెకాయ లాంటిదని అక్కడనుండి లభిస్తున్న ఆర్థిక వనరులతో తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోగలుగుతున్నామని తెలంగాణ ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారన్నారు.ఇంచుమించు సుమారుగా 1 లక్షా50 వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సంవత్సరానికి గాను హైదరాబాద్ ప్రాంతం అన్ని రకాల పన్నుల రూపంలో ప్రభుత్వానికి చేయూతనిస్తుందని అలాంటి ప్రాంతాన్ని సురక్షితంగా కాపాడుకోవడం కోసం అన్ని వర్గాల ప్రజలు అన్ని వర్గాల పార్టీలు అన్ని వర్గాల నాయకులు ప్రభుత్వాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో పాలు పొంపులు పంచుకోవలసిన అవసరం ఉందన్నారు.ప్రజలేమో తెలంగాణ వాదాన్ని బలపరుస్తుంటే రాజకీయ నాయకులు రాజకీయ పాలకులు తెలంగాణ ప్రాంతాన్ని రాజకీయా లకు అంటగడుతూ అభాసుపాలు చేస్తున్నారన్నారు.ప్రాంతాలను రెచ్చగొడితే దాని ప్రభావం పూర్తిగా ప్రజలపై పడుతుందని తెలిసే కావాలని తెలంగాణ ప్రాంతాన్ని రాజకీయాల వైపు రెచ్చగొడుతున్నారని గుర్తు చేశారు.మద్రాస్ నుండి విడగొట్టబడినప్పుడే తెలంగాణపై తీవ్రమైన కక్ష సాధింపు జరిగిందని 1948 నుండి 1954 వరకు తెలంగాణ ప్రాంతం స్వతహాగా ఏర్పాటు చేయబడినదని ప్రాంతం విడిపోతే ఆంధ్ర వలసవాదులు ఇతర రాష్ట్రాల వలసవాదులు హైదరాబాదును దోచుకునే హక్కులు కోల్పోతారని భావించిన తరుణంలోనే 1954లో కలిసికట్టుగా కుట్రజేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేయబడడానికి బలవంతపు రాజకీయాలను ప్రయోగించారని గుర్తు చేశారు.నాటి పాలకుల తీరుకు నాటి ఉద్యమకారులు తీర్పు నేటి పాలకుల తీరుకు నేటి ఉద్యమకారుల తీరుకు ఎంతో వ్యత్యాసం ఉందని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రాన్నే కాకుండా తెలంగాణ ప్రాంతాన్ని తెలంగాణ ప్రాంతీయ వాదాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలంగాణలోని నాలుగు కోట్ల మంది ప్రజలపై ఉందని తెలంగాణలో ఏ ప్రాంత ప్రజలైన సామాన్యమైన జీవితాన్ని జీవించడానికి అందరితో కలిసి పోవడానికి హక్కులు ఉంటాయి కానీ రాజకీయాలను రెచ్చగొట్టి రాజకీయాల కక్ష్యల్లోనికి ప్రజలను లాగి తెలంగాణ ప్రాంతాన్ని తెలంగాణ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని హెచ్చరించారు.సొంత ప్రాంతంలో నెగ్గలేని నాయకులంతా తెలంగాణ ప్రాంతంపై దిగజారుడు రాజకీయాలకు తెగబడుతున్నారని గుర్తుచేశారు.ప్రాంతాల మధ్య పాత కక్షలను రేపి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తే తెలంగాణ ప్రజలు తరిమి తరిమి కొడతారని గుర్తుంచుకోవాలన్నారు.అన్ని రాష్ట్రాలకు చెందిన ఉన్నత అధికారు లైన ఐఏఎస్,ఐపీఎస్ స్థాయిలో ప్రాంతాలను మరిచిపోయి రాష్ట్రాలను మరిచిపోయి ఉన్నత స్థాయిలో ఉద్యోగ ధర్మాన్ని కొనసాగిస్తున్న సందర్భాల్లో తెలంగాణ ప్రాంతాన్ని కన్నతల్లి లాంటి ప్రాంతంగా కాపాడుకుంటూ ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారని అలాంటి పరిస్థితులకు భిన్నంగా రాజకీయాలకు పాల్పడుతున్న నాయకులు అలాంటి అధికారులను చూసి సిగ్గుతో తలవంచుకోవాలని హెచ్చరించారు.

# అంబేద్కర్ నగర్ సర్పంచ్ చిట్టూరి రాజుకు 'దళిత రత్న' అవార్డు

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు చేతుల మీదుగా ఘన సన్మానం**

**వర్ధన్నపేట(జై భీమ్ న్యూస్)**



వర్ధన్నపేట నియోజకవర్గంలోని అంబేద్కర్ నగర్ గ్రామ సర్పంచ్ చిట్టూరి రాజుకు ప్రతిష్ఠాత్మక 'దళిత రత్న' అవార్డు లభించింది. దళితుల హక్కుల సాధన, సామాజిక న్యాయం, విద్యా చైతన్యం, ఉపాధి అవకాశాల కల్పనలో ఆయన అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా చిట్టూరి రాజు అవార్డును స్వీకరించారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి మర్యాదపూర్వకంగా కలవగా, ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వ్యక్తులకు ఇలాంటి గౌరవాలు దక్కడం సంతోషకరమన్నారు. గ్రామ స్థాయి నుంచి దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న చిట్టూరి రాజు సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. దళిత సంఘాల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించిన చిట్టూరి రాజు, విద్య, ఉపాధి, హక్కుల సాధన, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దళిత యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు విశేష ఆదరణ పొందుతున్నాయి. అవార్డు సందర్భంగా చిట్టూరి రాజు మాట్లాడుతూ, "దళిత రత్న అవార్డు నా వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదు, సమాజ సేవకు లభించిన గుర్తింపు. ఈ అవార్డుతో నాపై మరింత బాధ్యత పెరిగింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం మరింత అంకితభావంతో పనిచేస్తాను" అని తెలిపారు. చిట్టూరి రాజుకు దళిత రత్న అవార్డు లభించడంతో స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులు, యువకులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తుళ్ల రవి, ఉపసర్పంచ్ చంద్రయ్య,గ్రామ పార్టీ అధ్యక్షుడు సింగపురం ఎల్లయ్య, పారానంది రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవలో పదునైన దూకుడు నాయిని సొంతం

**ప్రజా అభిమానాన్ని చూరగొంటున్న నాయిని**
**ప్రజా సేవకు సుపరిచితుడు**
**ఎమ్మెల్యే నాయిని ప్రజా సేవకు కట్టుబడి ఉన్నారు**
**ప్రజా కార్యక్రమాలలో పరిణితి చెందుతున్న ప్రావీణ్యుడు**
**ప్రభుత్వ నిధులను హనుమకొండ వైపు మళ్ళిస్తున్నాడు**
**ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కోసం పరితపిస్తున్నారు**
**అభివృద్ధి పనుల్లో అడుగడుగు దూసుకుపోతున్నారు**
**ఎమ్మెల్యేతో మర్యాదపూర్వక కలయికలో జై భీమ్ చైర్మన్ ను సన్మానించిన నాయిని**

**హన్మకొండ జై భీమ్ న్యూస్ :**

ప్రజాసేవకు కట్టుబడి పని చేస్తే ఎలాంటి ఫలితాలను రాబట్టగలుగుతామో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి చేస్తున్న సేవలకు జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ సంపూర్ణ ఆనందాన్ని వ్యక్తపరిచారు.ప్రజలతో మమేకమవుతూ ప్రజల కష్టాలు తెలుసుకొని ప్రజలకు సహకారంగా నిలుస్తూ సేవలు చేయడం ఎమ్మెల్యే నాయిని ప్రత్యేక కార్యాచరణగా పెట్టుకున్నారని అభినందించారు.ప్రజాసేవ పట్ల మక్కువతో పనిచేస్తున్నందున ఎమ్మెల్యే విశ్వాసాన్ని బలపరుస్తుందని కొనియాడారు.ప్రజా క్షేత్రంలో శాసనసభ్యులుగా కొనసాగుతున్న సందర్భాలను పురస్కరించుకొని మంచి చెడులు ప్రశంసలు విమర్శలు సర్వసాధారణంగా వస్తూ ఉంటాయని వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా దీర్ఘకాలిక రాజకీయాల్లో పదవులు లేకుండా పార్టీ కొరకు కష్టపడి పనిచేసిన నాయకునిగా నాయినికి బలమైన గుర్తింపు కలలని గుర్తు చేశారు.గురువారం హన్మకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో ఆత్మీయ భేటీలో భాగంగా ఆయన క్యాంపు కార్యాలయంలో జై భీమ్ టీవీ ఫౌండర్,చైర్మన్ డాక్టర్ బరిగెల శివ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలు, సామాజిక పరిస్థితులు, దళిత–బహుజన వర్గాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజల సంక్షేమం కోసం ఎమ్మెల్యే చేస్తున్న సేవలను డాక్టర్ బరిగెల శివ అభినందించారు. అలాగే ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే నాయినికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా డాక్టర్ బరిగెల శివను ఆత్మీయంగా ఆహ్వానించి, సమాజ అభ్యున్నతి కోసం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు.



# ప్రజలపై మోపిన అధిక ధరలను ఉపసంహరించుకోవాలి

**ఎంసీపీఐ(యు)**
**జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి**

**హన్మకొండ, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఎంసీపీఐ(యు) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గురువారం హనుమకొండ ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ పరిపాలన అధికారి సుభాషిణికి పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాల కారణంగా దేశ ప్రజలు, రైతులు, కార్మికులు, ఆదివాసీలు తీవ్ర సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, వ్యవసాయ సంక్షోభం, పారిశ్రామిక యూనిట్ల మూతపడటం వంటి సమస్యలు ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్, సహజ వాయువు, ఎరువుల ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. అమెరికాతో ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం నుంచి వ్యవసాయ, పాడి ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలను మినహాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులన్నింటికీ కనీస మద్దతు



ధర (ఎంఎస్పీ)కు చట్టబద్ధ హోదా కల్పించాలని, డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు సి2౦50 శాతం ఫార్ములా ప్రకారం ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా హామీ ఇవ్వాలని కోరారు. ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు చేయడాన్ని శిక్షార్హ నేరంగా పరిగణించాలని, వ్యవసాయ ఖర్చులు మరియు ధరల కమిషన్‌కు చట్టబద్ధ హోదా కల్పించాలని అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు, కార్మికులకు 60 సంవత్సరాలు నిండిన తర్వాత నెలకు రూ.20 వేల సామాజిక భద్రతా పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. మహిళలు, ఆదివాసీలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులు, హత్యలను అరికట్టి దోషులను కఠినంగా శిక్షించాలని, ఓటు హక్కు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈడీ, సీబీఐ వంటి సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని నిలువరించాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ మూల్యాంకన కుంభకోణాలపై బాధ్యులపై చర్యలు తీసుకుని దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ అంశాలపై మాట్లాడుతూ ఇరాన్, వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద జోక్యాన్ని ఖండించారు. ఉత్తరప్రదేశ్ పారిశ్రామిక ప్రాంతాల్లో తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న కార్మికులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాసు సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు కూతురు వెంకటేశ్వర్లు, అన్నపోయిన ప్రేమలత, పట్టడం మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ బడా బాబులకు ఊడిగం చేస్తున్న మోదీ ప్రభుత్వం

**ఎంసీపీఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి విమర్శ**

**వరంగల్, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఎంసీపీఐ(యు) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గురువారం వరంగల్ ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ పరిపాలన అధికారి ఫణికుమార్‌కు పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు, ఆదివాసీల ప్రయోజనాలను విస్మరిస్తోందని ఆరోపించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పారిశ్రామిక యూనిట్ల మూతపడటం, వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెట్రోల్, డీజిల్, సహజవాయువు, ఎరువుల ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిరుద్యోగాన్ని నియంత్రించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. అమెరికాతో ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం నుంచి వ్యవసాయ, పాడి ఉత్పత్తులు, పండ్లు, కూరగాయలను మినహాయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఉత్పత్తులన్నింటికీ కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్టబద్ధ హోదా కల్పించాలని, డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సి2౦50 శాతం ఫార్ములా మేరకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వ్యవసాయ ఖర్చులు మరియు ధరల కమిషన్‌కు చట్టబద్ధ హోదా



ఇవ్వాలని, ఎంఎస్పీ కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు చేయడాన్ని శిక్షార్హ నేరంగా పరిగణించాలని అన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, రైతులు, కార్మికులకు 60 సంవత్సరాలు పూర్తయిన తర్వాత నెలకు రూ.20 వేల సామాజిక భద్రతా పెన్షన్ అందించాలని, రైతులు మరియు వ్యవసాయ కార్మికుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, ఆదివాసీలు, అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టి దోషులను కఠినంగా శిక్షించాలని, ఓటు హక్కు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని కోరారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఈడీ, సీబీఐ వంటి సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ, సీబీఎస్ఈ మూల్యాంకన కుంభకోణాలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, దోషులను శిక్షించాలని కోరారు. అంతర్జాతీయ అంశాలపై స్పందిస్తూ ఇరాన్, వెనిజులాపై అమెరికా జోక్యాన్ని ఖండించారు. ఉత్తరప్రదేశ్ పారిశ్రామిక ప్రాంతాల్లో తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న కార్మికులను వేధించకుండా వారికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, మాసు సావిత్రి, పార్టీ సభ్యులు జెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ యూట్యూబర్, ‘నందూస్ వరల్డ్’ ఛానల్ నిర్వాహకురాలు

**యూకేలో ఉద్యోగాల పేరుతో భారీగా వసూళ్లు.. ‘నందూస్ వరల్డ్’ దంపతులపై కేసు.. ‘విమెన్’ విక్టిమ్ కార్డు**



**ఆంధ్రప్రదేశ్ గుంటూరు 04 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కేసు నమోదు కాగానే ‘విమెన్’ అనే విక్టిమ్ కార్డు ఉపయోగిస్తూ, సానుభూతి కోసం మోసపోయిన వారినే హేళన చేస్తూ వీడియోలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రముఖ యూట్యూబర్, ‘నందూస్ వరల్డ్’ ఛానల్ నిర్వాహకురాలు అన్నే రమానందన, ఆమె భర్త జాగర్లమూడి మధుకర్‌పై వచ్చిన మోసం ఆరోపణలు సంచలనంగా మారాయి. గుంటూరుకు చెందిన ఈ దంపతులు ప్రస్తుతం యూకే (లండన్) లో నివసిస్తున్నారు. రమానందన ‘నందూస్ వరల్డ్’ పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ సోషల్ మీడియాలో గుర్తింపు పొందారు. ఈ పాపులారిటీని ఉపయోగించుకుని, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లో ‘డెస్టినీ కన్సల్టెన్సీ’ పేరుతో కార్యాలయాలు ఏర్పాటు చేసి, విదేశీ ఉద్యోగాలు, వీసా రెన్యూవల్స్ ఇప్పిస్తామని చెప్పి కార్యకలాపాలు నిర్వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లా కొత్తూరుకు చెందిన శివ క్రాంతి కుమార్ అనే వ్యక్తి లండన్‌లో చదువుకునే రోజుల్లో మధుకర్‌తో పరిచయం ఏర్పడింది. లండన్‌లో ఉద్యోగం చేసి భారత్‌కు వచ్చిన శివ క్రాంతి కుమార్.. వీసా రెన్యూవల్, భార్యకు ఉద్యోగం కోసం జశీూ ఇప్పిస్తామని చెప్పిన మధుకర్‌ను ఆశ్రయించారు. దీని కోసం రూ.15 లక్షలు చెల్లించాలని మధుకర్ సూచించగా, 2023లో శివ క్రాంతి కుమార్ నిందితులు తెలిపిన రెండు బ్యాంకు ఖాతాలకు ఆ మొత్తాన్ని బదిలీ చేశారు. బాధితుడు శివ క్రాంతి కుమార్ ఫిర్యాదు మేరకు గత ఏడాది నవంబరులోనే ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఈ వ్యవహారంపై కేసు నమోదైంది. ఈ కేసులో మధుకర్ (ఏ 1), రమానందన (ఏ 2), మోహన్‌రావు (ఏ 3)గా పోలీసులు నమోదు చేశారు. నోటీసులు జారీ చేసినప్పటికీ నిందితుల నుంచి స్పందన రాలేదని సమాచారం.కేసును కొట్టివేయాలంటూ హైకోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం పిటిషన్ విచారణలో ఉంది. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి బాధితులమంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెరుగుతున్నాయి. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.20 లక్షల వరకు వసూలు చేసి మోసం చేశారనే ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్





**సంగెం, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

సంగెం మండలం చింతలపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పంట కాలువల పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించిన ఆమె ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలు, పని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతను కాపాడుతూ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వేసవి, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్మికుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించిన కలెక్టర్, గ్రామాభివృద్ధి లక్ష్యంగా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం ప్రాముఖ్యతను వివరించి, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మ పావని, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష



**హన్మకొండ, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఆర్‌డీఓలు మేన శ్రీను, నాగ పద్మజతో పాటు సంబంధిత శాఖల అధికారులతో పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) అధికారులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు. పరకాల మహిళా డెయిరీ పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన ఆరు మండలాల్లో చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. డెయిరీ అభివృద్ధి ద్వారా గ్రామీణ మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులు లభించడంతో పాటు మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు మరింత బలం చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డెయిరీ కార్యకలాపాల విస్తరణ, పాల సేకరణ కేంద్రాల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పన, సభ్యుల నమోదు తదితర కార్యక్రమాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ డెయిరీ అభివృద్ధికి అవసరమైన అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టి పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారులు రాధాకిషన్, బాలకృష్ణ, అడిషనల్ డీఆర్‌డీఓ వెంకటేశ్వర్లు, డీపీఎంలు సరిత, వరలక్ష్మి, మెప్మా కోఆర్డినేటర్లు రజితరాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ఉక్కుపాదం

విక్రయిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించిన పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




**వరంగల్, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. విద్యార్థులను చెడు అలవాట్ల బారిన పడకుండా కాపాడేందుకు వరంగల్ కమిషనరేట్ పరిధిలో "ఆపరేషన్ సేఫ్ స్కూల్" పేరుతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల పరిసరాల్లోని పాన్ షాపులు, ఇతర దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయం ద్వారా విద్యార్థులు మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాసంస్థల సమీప ప్రాంతాలను టొబాకో ఫ్రీ జోన్లుగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు నిషేధమని తెలియజేస్తూ రూపొందించిన గోడపత్రికను పోలీస్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తులు విక్రయించిన వారిపై సిగరెట్లు అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ యాక్ట్-2003 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే జువైనల్ జస్టిస్ యాక్ట్-2015లోని సెక్షన్ 77 ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎవరైనా విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే స్థానిక పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్ రెడ్డి, సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్ రాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఏఎస్సై రాజేందర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హసన్పర్తి మండలంలో ఆయా, ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్

**హసన్ పర్తి, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



హసన్ పర్తి మండలంలోని ప్రీ-ప్రైమరీ తరగతులు మంజూరైన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గౌరవ వేతనం ప్రాతిపదికన ఆయా, ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూన్ 8, 2026 వరకు సంబంధిత పాఠశాలల్లో నిర్ణీత దరఖాస్తు ఫారంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రధానోపాధ్యాయులు ఒక ఉపాధ్యాయుడిని లేదా బాధ్యతగల వ్యక్తిని పాఠశాలలో అందుబాటులో ఉంచాలని ఆదేశించినట్లు తెలిపారు. జూన్ 8 వరకు స్వీకరించిన దరఖాస్తులను వాటి జత ప్రతులతో సహా జూన్ 9న మండల విద్యాశాఖ కార్యాలయానికి సమర్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల ఎంపికలో ముందుగా సంబంధిత గ్రామం లేదా ఆవాసానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు, అనంతరం మండలంలోని ఇతర గ్రామాలకు చెందిన అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. ప్రీ-ప్రైమరీ విభాగాలు మంజూరైన పాఠశాలల్లో సిద్దాపూర్, వంగపహాడ్, పెగడపల్లి, ముచ్చర్ల, హసన్పర్తి, బైరాన్‌పల్లి, ఎల్లాపూర్, భీమారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతో పాటు జయగిరి, అనంతసాగర్, మునుపెల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి కోరారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువతకు సూచన
డీసీపీ భాస్కర్

**బెల్లంపల్లి, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. గురువారం బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, తెలియని లింకులు, ఫోన్ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. అదేవిధంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు, యువకులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించి మంచి మార్గంలో ముందుకు సాగాలని కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని, అనుమానాస్పద సంఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ, ఎస్ఐలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కేయూ అవెన్యూ ప్లాంటేషన్ నూతన ఇంచార్జ్‌గా డాక్టర్ బి. వెంకట గోపినాద్ నియామకం



**హన్మకొండ, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయ అవెన్యూ ప్లాంటేషన్ నూతన ఇంచార్జ్‌గా మైక్రోబయాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. వెంకట గోపినాద్‌ను నియమిస్తూ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం అవెన్యూ ప్లాంటేషన్ ఇంచార్జ్‌గా ఉన్న డాక్టర్ పి. వెంకటయ్య నుంచి డాక్టర్ గోపినాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. డాక్టర్ గోపినాద్ 2010లో కాకతీయ విశ్వవిద్యాలయంలో చేరారు. ఆయన విశ్వవిద్యాలయ దూరవిద్యా కేంద్రంలో అసిస్టెంట్ సైన్స్ డైరెక్టర్‌గా, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మైక్రోబయాలజీ విభాగ ఇంచార్జ్‌గా సేవలందించారు. ప్రస్తుతం యూనివర్సిటీ కాలేజీ మైక్రోబయాలజీ విభాగంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవెన్యూ ప్లాంటేషన్ ఇంచార్జ్‌గా నియమితులైన డాక్టర్ బి. వెంకట గోపినాద్‌ను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

## కేయూలో పర్యావరణ పోస్టర్ ఆవిష్కరణ.. మొక్కల నాటే కార్యక్రమం

**హన్మకొండ, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026 సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కార్యాలయంలో ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పర్యవేక్షణలో రూపొందించిన పర్యావరణ అవగాహన పోస్టర్‌తో పాటు మొక్కల సంరక్షణ ప్రతిజ్ఞ పత్రాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యం మానవ మనుగడకు అత్యంత అవసరమని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలకు వృక్ష సంపదే ప్రధాన పరిష్కారమని పేర్కొన్నారు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, అడవుల పునరుద్ధరణతో పాటు ఇంటింటా పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్లైమేట్ యాక్షన్ బిగిన్స్ విత్ యూ అనే నినాదాన్ని ఆచరణలో పెట్టి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఓఎస్‌డీ ఆచార్య బి. వెంకటరామిరెడ్డి, ఆచార్య నారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనగంటి శ్రీకాంత్, తాళ్లపల్లి రామస్వామి గౌడ్, అనగంటి రాజేష్, బోనగాని యాదగిరి గౌడ్, గాజుల సంపత్, గుండేటి చక్రపాణి, దాసరి వినయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ కార్యకర్తలు చింతగట్టు కెనాల్ గట్టు వెంట మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.



## జిల్లాకు 4 వేల గంజాయి టెస్టింగ్ కిట్లు

డీ-అడిక్షన్‌తో యువతలో మార్పు.. మహబూబాబాద్‌ను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం : ఎస్పీ డాక్టర్ శబరీష్

**మహబూబాబాద్, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మహబూబాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఐపీఎస్ తెలిపారు. గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం నిఘా నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది రాత్రి వేళల్లో విస్తృతంగా గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలు, యువత ఎక్కువగా గుమికూడే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పోలీసు శాఖకు అత్యాధునిక 4,000 గంజాయి టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని ఎస్పీ వెల్లడించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది ఈ కిట్లను వెంట తీసుకెళ్తూ అనుమానిత వ్యక్తులు లేదా పదార్థాలను అక్కడికక్కడే పరీక్షించి కేవలం 10 నిమిషాల్లో ఫలితాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో గంజాయి సేవిస్తున్న వారిని, గంజాయి కలిగి ఉన్న వారిని వేగంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని చెప్పారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి డీ-అడిక్షన్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అలవాటును విడిచిపెట్టాలనుకునే వారు పోలీసులను సంప్రదిస్తే కౌన్సెలింగ్, వైద్య సహాయం, పునరావాస సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, విక్రయించడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని హెచ్చరించిన ఎస్పీ, ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి విక్రయం, వినియోగం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించిన ఎస్పీ, ప్రజలు, మీడియా, విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించి మహబూబాబాద్‌ను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

## అక్రమ మట్టి, ఇసుక రవాణాపై కలెక్టర్ కఠిన చర్యలు

మూడు ట్రాక్టర్లు సీజ్.. చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

**కాగజ్‌నగర్, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




జిల్లాలో అక్రమ మట్టి, ఇసుక రవాణాపై జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తోంది. కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం, మాండవ, ఆరెగూడ, అనుకోడ గ్రామాల్లో చెరువులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. హరిత అక్రమ మట్టి రవాణాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నజ్రుల్‌నగర్ విలేజ్ నంబర్-12 పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించిన కలెక్టర్, వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంబంధిత శాఖల అనుమతులు లేకుండా మట్టి లేదా ఇసుక రవాణా చేపట్టడం చట్టవిరుద్ధమని తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి, ఇసుక రవాణా చేపట్టే ముందు తప్పనిసరిగా సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందాలని సూచించారు. జిల్లాలో సహజ వనరుల పరిరక్షణతో పాటు అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ప్రైవేటు పాఠశాలలకు డీఈవో హెచ్చరిక

**ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి ఫీజుల పేరుతో విద్యార్థులను వేధించరాదు : జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎల్.వి. గిరిరాజ్ గౌడ్**






**హన్మకొండ జిల్లా/హసన్ పర్తి, 4 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఫీజుల పేరుతో విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ వేధించరాదని జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ స్పష్టం చేశారు. హసన్ పర్తి మండలంలోని స్కిల్ స్టార్క్ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్ల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలలు పాటించాల్సిన నిబంధనలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. జీవో ఎంఎస్ నెం.1, విద్యాశాఖ, తేదీ 01-01-1994 ప్రకారం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ప్రైవేటు పాఠశాల తప్పనిసరిగా అమలు చేయాలని, వాటిని ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలకు చెందిన బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఫీజుల వసూళ్ల విషయంలో విద్యార్థులను వేధించడం బాలల హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో గవర్నింగ్ బాడీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించి, వాటి తీర్మానాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. గవర్నింగ్ బాడీ నిర్ణయించిన మేరకే ఫీజులను నిర్ణయించి, వాటి వివరాలను నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యా నాణ్యత, పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలపై తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహించి సమాచారం అందించాలని తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతోనే బోధన నిర్వహించాలని, అర్హత లేని వ్యక్తులను ఉపాధ్యాయులుగా నియమించరాదని పేర్కొన్నారు. బూట్లు, సాక్స్, బెల్టులు, టైలు, యూనిఫారాలు వంటి వస్తువులను పాఠశాలల ద్వారా విక్రయించరాదని, వాటి కొనుగోలుకు కనీసం మూడు దుకాణాలను సూచించాలని తెలిపారు. తల్లిదండ్రులు తమకు నచ్చిన చోట నుంచి ఈ వస్తువులను కొనుగోలు చేసినా వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వేధించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఎంఓ సుమాదేవి, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, హనుమకొండ, కాజీపేట మండల విద్యాశాఖ అధికారులు నెహ్రూ, మనోజ్‌కుమార్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# నల్లబెల్లిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ

**జనగణనలో ప్రజలు భాగస్వాములు కావాలి : తహసీల్దార్ విజయసాగర్**




**నల్లబెల్లి, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వర్ధన్నపేట మండల తహసీల్దార్ విజయసాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయసాగర్ మాట్లాడుతూ, భారతదేశంలో డిజిటల్ పద్ధతిలో జనగణన ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జనగణనలో ప్రజలు చురుకుగా భాగస్వాములు కావాలని, స్వీయ నమోదు చేసుకోవడంతో పాటు గృహాల వారీగా నిర్వహించే గృహ గణన కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కూడా కొనసాగుతోందని, ప్రజలు తమ వివరాలను పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. అదేవిధంగా వర్షాకాల సన్నద్ధత, సురక్షిత తాగునీటి సరఫరా, పరిశుభ్రత, మొక్కల పెంపకం, వనమహోత్సవ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్ధన్నపేట ఎస్సై సాయిబాబా మాట్లాడుతూ, గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. రానున్న వర్షాకాలంలో వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని వివరించారు. గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ మాట్లాడుతూ, గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంతో పాటు ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. జల సంరక్షణ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, రానున్న వర్షాకాలంలో గ్రామంలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల ఏపీవో నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ అమరేందర్, పంచాయతీ కార్యదర్శి షేక్ హుస్సేన్, వార్డు సభ్యులు, గ్రామస్థాయి అధికారులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వేయి మాటలకు సమానం ఒక చిత్రం : డాక్టర్ రాందాన్

**650 చిత్రాలు, క్రాఫ్ట్ నమూనాలతో ఆకట్టుకున్న టిటిసి డ్రాయింగ్ శిక్షణార్థులు**





**హన్మకొండ, 4 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టిటిసి) కోర్సు -- చిత్రకళ (డ్రాయింగ్) 42 రోజుల శిక్షణా శిబిరంలో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన చిత్రకళ, క్రాఫ్ట్ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులు రూపొందించిన సుమారు 650 పెయింటింగ్స్, వివిధ రకాల క్రాఫ్ట్ నమూనాలు సందర్శకులను అలరించాయి. ఈ ప్రదర్శనకు గౌరవ అదనపు పరీక్షల నిర్వహణ అధికారి మధుసూదన్ రావు, జిల్లా కామన్ బోర్డు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాందాన్, సెక్టోరియల్ అధికారులు సుమ, మహేష్, మండల విద్యాశాఖ అధికారి నెహ్రూ ముఖ్య అతిథులుగా హాజరై ప్రదర్శనను సందర్శించారు. అనంతరం శిక్షణార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాందాన్ మాట్లాడుతూ, చిత్రకళ అనేది కేవలం కళ మాత్రమే కాదని, సమాజానికి సందేశాన్ని చేరవేసే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. వేయి మాటలతో చెప్పలేని విషయాన్ని ఒక చిత్రం ద్వారా ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా చేయవచ్చన్నారు. సామాజిక సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, మానవ విలువలు, ఆరోగ్య అవగాహన వంటి అంశాలపై సందేశాత్మక చిత్రాలను రూపొందించడం ద్వారా సమాజంలో చైతన్యం తీసుకురావచ్చని తెలిపారు. ప్రతి చిత్రకారుడు తనకంటూ ప్రత్యేక శైలిని అలవర్చుకొని కళారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ మధుసూదన్ రావు మాట్లాడుతూ, శిక్షణా శిబిరంలో నేర్చుకున్న సాంకేతిక నైపుణ్యాలను భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తిలో సమర్థవంతంగా వినియోగించాలని కోరారు. భావితరాల విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో చిత్రకళ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రముఖ చిత్రకారులు రాజా రవి వర్మ, బాపు, వడ్డాది పాపయ్య వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని ఆధునిక సాంకేతికతతో చిత్రకళను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. కోర్సు డైరెక్టర్ బద్దం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో గత 35 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా ఛాత్రోపాధ్యాయులు రూపొందించిన చిత్రాలు, క్రాఫ్ట్ నమూనాలు వారి సృజనాత్మకతకు నిదర్శనమని కొనియాడారు. వివిధ సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ అంశాలను ప్రతిబింబించే చిత్రాలు ప్రదర్శనకు వచ్చిన వారిని ఆకట్టుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రంగవల్లి పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో పదవీ విరమణ పొందుతున్న చిత్రలేఖన ఉపాధ్యాయులు నాగయ్య, ఈశ్వరయ్య, కమలాకర్‌లను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోర్సు నిర్వాహకులు రమేష్ బండారి, విష్ణుమూర్తి, నాగరాజు, ఉపాధ్యాయులు కంది శ్రీనివాస్ రెడ్డి, లింగమూర్తి, రోజారాణి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, కొమురయ్య, పద్మశ్రీ, మమత, ఈశ్వరయ్య, రమేష్, శ్యామ్‌సుందర్, కమలాకర్, అనుపమ, శారద, రాజేందర్, నాగయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



# గురుకుల హాస్టల్‌కు ఆహార పదార్థాల సరఫరా కోసం టెండర్లు

**మైనారిటీ గురుకులానికి ఆహార పదార్థాల సరఫరా కోసం టెండర్ల ఆహ్వానం**
**కూరగాయలు, చికెన్, పండ్లు, మటన్ సరఫరాకు అవకాశం**




**ములుగు, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ములుగు జిల్లాలోని తెలంగాణ మైనారిటీల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల (బాలికలు), ములుగులో 2026-27 విద్యా సంవత్సరానికి అవసరమైన ఆహార పదార్థాల సరఫరా కోసం సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ (ఎఫ్ఏసీ) అధికారి బి. రామ్మోహన్ తెలిపారు. విద్యార్థినుల హాస్టల్ నిర్వహణతో పాటు వారి ఆహార అవసరాల కోసం కూరగాయలు, స్కిన్‌లెస్ చికెన్, పండ్లు, మటన్ సరఫరా చేసేందుకు ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు, ఫర్మ్‌ల నుంచి టెండర్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి టెండర్ అంశానికి దరఖాస్తు ఫారం ధర రూ.2,000గా నిర్ణయించగా, ధరావత్ (ఈఎండీ)గా రూ.30,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. టెండర్‌కు సంబంధించిన పూర్తి నియమ నిబంధనలు, ఈఎండీ వివరాలు టెండర్ ఫారంలో పొందుపరిచినట్లు వెల్లడించారు. టెండర్ దరఖాస్తుల కోసం రూ.2,000 డిమాండ్ డ్రాఫ్ట్‌ను "డిస్ట్రిక్ట్ మైనారిటీస్ వెల్ఫేర్ ఆఫీసర్ అండ్ డిస్ట్రిక్ట్ కలెక్టర్, ములుగు" పేరున తీసి జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయం, రూమ్ నంబర్-06, సంక్షేమ భవన్, ములుగు వద్ద సమర్పించి దరఖాస్తు పొందవచ్చని తెలిపారు. దరఖాస్తు రుసుము, ఈఎండీ చెల్లింపులో ఎలాంటి మినహాయింపులు ఉండవని, చెల్లింపులు చేయని టెండర్ దరఖాస్తులు తిరస్కరించబడతాయని స్పష్టం చేశారు. టెండర్ నోటిఫికేషన్ జూన్ 4న విడుదల కాగా, టెండర్ దరఖాస్తులు జూన్ 5 నుంచి జూన్ 10 వరకు అందుబాటులో ఉంటాయి. టెండర్ల సమర్పణకు జూన్ 10 సాయంత్రం 5 గంటల వరకు గడువు నిర్ణయించారు. సమర్పించిన టెండర్లను జూన్ 11న సాయంత్రం 4 గంటలకు ములుగు కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) చాంబర్‌లో తెరవనున్నట్లు తెలిపారు. టెండర్ నిబంధనలు, తేదీలు లేదా ఇతర షరతుల్లో మార్పులు చేసే అధికారం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్‌కు ఉంటుందని, అవసరమైతే టెండర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసే అధికారం కూడా వారికి ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయాన్ని లేదా 9989661146 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# మహాదేవపుర నియోజకవర్గంలో అక్రమా కట్టడాలను తొలగించిన ఎమ్మెల్యే



**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

మహాదేవపుర నియోజకవర్గ ప్రజల సులభతర రాకపోకల కోసం, పట్టందూర్ అగ్రహార సర్వే నెం. 40 వద్ద ఉన్న అక్రమ కట్టడాలను బిజెపి మాజీ మంత్రి అరవింద లింబావాలి ప్రస్తుత ఎమ్మెల్యే మంజుల అరవింద్ నేతృత్వంలో తొలగించడం జరిగింది. దీనితో హోప్ ఫార్మ్ జంక్షన్ వద్ద ఉచిత లెఫ్ట్ టర్న్ మరియు అండర్‌పాస్ నిర్మాణానికి మార్గం సుగమమైంది అని బిజెపి నాయకుడు రాజేష్ ఎల్ తెలియజేశారు. మాజీ మంత్రి మరియు మహాదేవపురం నియోజకవర్గం టాస్క్ ఫోర్స్ చైర్మన్ అరవింద్ లింబావళి మరియు ఎమ్మెల్యే శ్రీమతి మంజుల అరవింద్ లింబావళి నాయకత్వంలో ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా బీబీఎంపీ ఇంజనీరింగ్ సెల్, టీడీఆర్ భూసేకరణ అధికారులు, రెవెన్యూ శాఖ, కే.ఆర్.పురం తహసీల్దార్, మరియు టాస్క్ ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య నేడు శాశ్వతంగా పరిష్కరించబడింది. దీనివల్ల ప్రతిరోజూ ఈ జంక్షన్ గుండా ప్రయాణించే లక్షలాది మంది ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది అని తెలిపారు.

# పచ్చదనమే పర్యావరణ సమస్యలకు పరిష్కారం : వీసీ కె. ప్రతాప్ రెడ్డి

**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**
**ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ, మొక్కల నాటడం**

**హన్మకొండ, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**





ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కార్యాలయంలో ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పర్యవేక్షణలో రూపొందించిన పర్యావరణ అవగాహన పోస్టర్‌తో పాటు మొక్కల సంరక్షణపై ప్రతిజ్ఞ పత్రాన్ని కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, మానవ మనుగడకు పర్యావరణ సమతుల్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న పర్యావరణ సమస్యలకు పచ్చని చెట్లే ప్రధాన పరిష్కారమని అన్నారు. భావితరాలకు పచ్చదనం ఆయువుపట్టుగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కనుమరుగవుతున్న అడవులను పునరుద్ధరించడంతో పాటు రహదారుల వెంట, గ్రామాల్లో, పట్టణాల్లో, ఇంటింటా పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. "క్లైమేట్ యాక్షన్ బిగిన్స్ విత్ యూ " అనే అంతర్జాతీయ నినాదాన్ని ఆచరణలో పెట్టి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచందర్, ఓఎస్‌డీలు ప్రసాద్, బి. వెంకటరామి రెడ్డి, ప్రొఫెసర్ నారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనగంటి శ్రీకాంత్, తాళ్లపల్లి రామస్వామి గౌడ్, అనగంటి రాజేష్, బోనగాని యాదగిరి గౌడ్, గాజుల సంపత్, గుండేటి చక్రపాణి, దాసరి వినయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ కార్యకర్తలు చింతగట్టు కెనాల్ గట్టు వెంట మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమానికి సహకరించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డికి సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# జీర్ణవ్యవస్థ, కాలేయ వ్యాధుల చికిత్సలో నూతన ప్రమాణాలు

### అత్యాధునిక సాంకేతికతతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు : డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి



**హన్మకొండ, 4 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

జీర్ణవ్యవస్థ, కాలేయం, ప్యాంక్రియాస్, పిత్తనాళాలకు సంబంధించిన వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్నట్లు యశోద ఆసుపత్రుల గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ విభాగానికి చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. గురువారం హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యశోద ఆసుపత్రుల గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ బృందం ఎండోస్కోపీ, ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ వంటి అత్యాధునిక సాంకేతికతలతో పాటు థర్డ్-స్పేస్ ఎండోస్కోపీలోనూ విశేష నైపుణ్యాన్ని కలిగి ఉందన్నారు. ప్రారంభ దశలో గుర్తించిన జీర్ణాశయ క్యాన్సర్లు, ప్రీ-క్యాన్సర్ గడ్డలను శస్త్రచికిత్స అవసరం లేకుండానే ఎండోస్కోపిక్ సబ్‌మ్యూకోసల్ డిసెక్షన్ (ఈ.ఎస్.డి) ద్వారా తొలగించే సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే అకలేసియా వంటి మింగుడుకు సంబంధించిన వ్యాధులకు పెరొరల్ ఎండోస్కోపిక్ మయోటమీ (పిఓఈఎం), రిఫ్లక్స్ సమస్యల చికిత్సకు ఆంటీ-రిఫ్లక్స్ మ్యూకోసెక్టమీ వంటి ఆధునిక ఎండోస్కోపిక్ విధానాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జీర్ణాశయ రక్తస్రావం, ప్యాంక్రియాటిక్ మరియు బిలియరీ వ్యాధుల నిర్వహణలో తమ బృందానికి విశేష అనుభవం ఉందని తెలిపారు. అత్యాధునిక వైద్య సాంకేతికత, నిపుణులైన వైద్యుల సేవలు, బహుళ విభాగాల సమన్వయం, రోగి-కేంద్రీకృత వైద్య విధానాలతో యశోద ఆసుపత్రుల గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ విభాగం ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందిస్తోందని డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రుల అసిస్టెంట్ మేనేజర్లు రాజ్‌కుమార్, స్వరాజ్, టీమ్ లీడర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం భూముల కౌలు వేలం పాటలు నిర్వహణ



**భీమదేవరపల్లి, జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం భూముల కౌలు వేలం పాటలు శుక్రవారం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటల్లో పలువురు రైతులు పాల్గొని భూములను కౌలుకు దక్కించుకున్నారు. వేలం వివరాల ప్రకారం సర్వే నెంబర్-95లోని భూమిని గుర్రాల స్వప్న రూ.8 వేల కౌలుకు దక్కించుకోగా, సర్వే నెంబర్లు 28, 29లోని భూమిని ముప్పు వెంకటయ్య రూ.37,500కు కౌలుకు పొందారు. అలాగే సర్వే నెంబర్-97లోని భూమిని మంగ రవీందర్ రూ.9 వేలకూ, సర్వే నెంబర్-40లోని భూమిని కొత్తపల్లి రవీందర్ రూ.3,600కు కౌలుకు దక్కించుకున్నారు. ఈ వేలం పాటలను పర్యవేక్షణ అధికారి శ్రీమతి నందనం కవిత పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్, దేవస్థాన పాలకవర్గ సభ్యులు, చంటయ్యపల్లి ఉపసర్పంచ్, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. దేవస్థానం ఆదాయ వనరుల పెంపు, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల సమీకరణలో భాగంగా ఈ కౌలు వేలం పాటలను నిర్వహించినట్లు దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి పి. కిషన్ రావు తెలిపారు.

# సుచి యాస్కి త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన మాదిగ యూత్ ఫోర్స్ నాయకులు

**హైద్రాబాద్, 4 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మధు యాస్కి గౌడ్ సతీమణి సుచి యాస్కి అమెరికాలో ప్రమాదానికి గురైన విషయం తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేసినట్లు మాదిగ యూత్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పడిదల ప్రసాద్ తెలిపారు. సుచి యాస్కి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే మధు యాస్కికి ఆయురారోగ్యాలు ప్రసాదించి, రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో ప్రజాసేవ కొనసాగించే అవకాశం కల్పించాలని ఆకాంక్షించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద వర్గాల అభ్యున్నతి కోసం మధు యాస్కి విశేష సేవలు అందించిన నాయకుడని పడిదల ప్రసాద్ కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి తగిన గుర్తింపు లభించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు దక్కాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి. శ్రీనాథ్, మచ్చ రమేష్, దేవరకొండ నాగయ్య, శ్రీనివాస్ యాదవ్, కృష్ణ యాదవ్, దయాకర్ తదితరులు పాల్గొని సుచి యాస్కి త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.



# రెండేళ్ల కూటమి విజయాలపై ప్రజలకు వివరణ

### మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి
### కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు సూచన



**అమరావతి,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా అందరూ ప్రజల్లోకి వెళ్లాలని మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. గురువారం సీఎం అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ శాఖలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. గత ప్రభుత్వం నిర్వాకాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని.. అప్పటి నుంచి ఈ రెండేళ్లలో ఏం చేశామో శాఖల వారీగా ఈనెల 28లోపు ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సీఎం చెప్పారు. దేశీయ, స్థానిక అవసరాల మేరకు పంటలు వేసే విధంగా రైతులను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేయలేదంటూ ఉన్నతాధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నా ఎందుకిలా ఉన్నారని అధికారులపై సీరియస్ అయ్యారు. అగ్రిగోల్డ్ కేసులను వెంటనే పరిష్కరించేందుకు మొత్తం 31 కొత్త పోస్టులు మంజూరు చేసిన సీఎం.. వెంటనే కేబినెట్ సబ్ కమిటీని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏపీలో16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ రాద్ధాంతం చేస్తున్నారని.. ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూశారని మండిపడ్డారు. 'మనం గట్టిగా తిప్పికొట్టడంతో ఇప్పుడు తోక ముడిచారు. మనం చెప్పేది వివరంగా ప్రజలకు తెలియజేయాలి. అప్పుడు మాత్రమే ప్రజలకు తెలుస్తుంది' అని వివరించారు. ఇటీవల రాజధానిలో కొంతమంది రైతులను జగన్ కలిశారని సీఎం చెప్పగా.. జగన్ దగ్గరకు వెళ్లిన అశోక్ అనే రైతు నిన్న నేలపాడులో తన భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. రైతులను జగన్ గందరగోళంలోకి నెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని.. కానీ రాజధాని రైతులు ఇప్పుడు కూడా జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నారని సీఎం అన్నారు. జగన్ చెప్పిన మాటలను నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ప్రజలకు నిజాలు వివరిస్తే వాళ్లు పూర్తిగా అర్థం చేసుకుంటారన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నంలో యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# ఇండియా కూటమికి బీటలు

### 8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డీఎంకె
### హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల

**న్యూఢిల్లీ,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం-ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే - కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# రష్యాలో కొనసాగిన లోకేశ్ పర్యటన

### బిజినెస్ ఫోరమ్‌లో పెట్టుబడులపై చర్చ

**అమరావతి,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**



రష్యాలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఎస్పీఐఈఎఫ్ బిజినెస్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. భారత్, రష్యాల మధ్య ఉన్న సుదీర్ఘ సాంకేతిక, ఆర్థిక అనుబంధాన్ని గుర్తుచేస్తూ, 2030 నాటికి 100 బిలియన్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో ఆంధ్రప్రదేశ్‌ను 2.5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ధ్యేయమని ప్రకటిస్తూ.. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను కేవలం పెట్టుబడిదారులుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా ఆహ్వానించారు. ఈ సదస్సులో భాగంగా రష్యాకు చెందిన ప్రముఖ ఉక్కు దిగ్గజం 'నోవోస్టల్-ఎం సంస్థ చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారతదేశంలో అత్యాధునిక ఈఏఎఫ్ (ఇంఈ) గ్రీన్ స్టీల్ ఎ÷-లాంట్ నిర్మాణాన్ని చేపట్టాలని, అదేవిధంగా ఏపీలోని ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక హబ్ 'శ్రీసిటీ'లో రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ 'సిస్టమా' ప్రెసిడెంట్ తాగిర్ సిట్దేకోవ్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేష్.. రాష్ట్రంలో సరికొత్త రవాణా, సాంకేతిక ప్రాజెక్టులపై చర్చించారు. ఆంధప్రదేశ్‌లోని అంతర్గత జలరవాణా మార్గాలలో పర్యావరణ అనుకూల 'ఎలక్ట్రిక్ రివర్ మెట్రో' పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని కోరారు. దీంతో పాటు భవిష్యత్ సాంకేతికతలకు కేంద్రంగా నిలుస్తున్న ఏపీ 'క్వాంటమ్ వ్యాలీ ఫ్రేమ్ వర్క్' ప్రాజెక్టులో సిస్టమా సంస్థను భాగస్వామి కావాల్సిందిగా మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు. లోకేశ్‌తో లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఉన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

### వర్షాభావంపై సన్నద్ధం చేయండి
### వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన

**హైదరాబాద్,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎ÷-లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

# విధ్వంస పాలన విముక్తికి రెండేళ్లు

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

విధ్వంస పాలన నుంచి ఏపీ ప్రజలకు విముక్తి లభించి రెండేళ్లు పూర్తి అయ్యిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల రాక్షస పాలనతో రాష్ట్ర ప్రజలను జగన్ వెన్నుపోటు పొడిచారని వ్యాఖ్యానించారు. 2024లో చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన ఏపీ ప్రజలు.. 2029లోనూ అదే తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మళ్లీ ప్రజాస్వామ్య వెలుగులు కనిపిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ విధ్వంసాన్ని సరిదిద్దుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని మంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శరవేగంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురావడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్





**కార్మికుల సమస్యలపై సిఎంకు పట్టింపు లేదు**
**జలమండలి గేట్ మీటింగ్‌లో తలసాని శ్రీనివాసయాదవ్**

**హైదరాబాద్,జూన్ 4 (జై భీమ్ న్యూస్) :**

ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని తలసాని ప్రశ్నించారు. మీ సమస్యలపై ముఖ్యమంత్రికే పట్టింపు లేనప్పుడు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తిని గెలిపిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం అవగాహన, ప్రణాళిక లేకుండా మూడు కార్పొరేషన్లుగా విభజించి ఉద్యోగులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తలసాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ రోజు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం త్రాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని మండిపడ్డారు. మీకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని, మీ హక్కుల కోసం అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. మీ కోసం గొంతుక వినిపించే గులాబీ జెండాకు మద్దతు తెలపాలని తలసాని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్డులోని అనేక సమస్యలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తలసాని హామీ ఇచ్చారు.

# నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు

**ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని**





**హైదరాబాద్,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో కి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, సుమిత్ సింగ్, కట్టా బలరాం, సాయి, ప్రదీప్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# రైతులు ఇబ్బందులను పట్టించుకోని సిఎం

**పర్యటనలతో ఒరిగేదేమీ లేదు: నిరంజన్ రెడ్డి**

**వనపర్తి,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డ సమయంలో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. సీఎం గురువారం పాలమూరు పర్యటన సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు. విపత్తుల సమయంలో రాకుండా , రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న ఈ పర్యటనలు ఎవరికి ఉపయోగమని నిలదీశారు. సీఎం పర్యటనే వేళ తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్లు కల్లాల్లోనే ఉన్నాయని,రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్‌లో పర్యటిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

# వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు

**ప్రజలకు అదనపు కలెక్టర్ సూచన**

**జగిత్యాల,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయకపు గూడెం, బీర్పూర్ మండలంలోని బీర్పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కందేనకుంట గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు గురువారం నిర్వహించారు. బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుద్య నిర్వహణపై ఆ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు, పారిశుద్య నిర్వహణ, ఎలినినో ప్రభావ పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడీ చేసుకోవడం, మ చర్యలు, గ్రామాల్లో ఇంకుడు గంతల నిర్మాణాల ఏర్పాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో బీర్పూర్ మండల ప్రత్యేక అధికారి ప్రకాష్, తహసీల్దార్లు వహిదొద్దిన్, సుజాత, ఎంపీడీఓలు ఎండి సలీం, భీమేష్ ప్రజాప్రతినిధులు చేకూట ఆరుణ శేఖర్, మర్రిపెల్లి అశ్విని, పుష్పనాథ్, మల్యాల జ్యోతి, ఎలమట్ల హరీష్, ఎడ్ల సృజన సుశీన్, హర్షకోట రాజగోపాల్ రావు, కొమిరే నర్సయ్య, ఆయా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దు

**ఆంధ్రా నాయకులకు గుత్తా కౌంటర్**

**హైదరాబాద్,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దని తెలంగాణ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభను నిర్వహిస్తామనడం సరైనది కాదని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ వాడిన భాష తీరు సరిగా లేదని వెల్లడించారు. అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అంటున్న సీఎం ,డిప్యూటీ సీఎం , మంత్రులు అమరావతిలోనే నివాసం ఉండాలని సూచించారు. తెలంగాణ కన్నా ఏపీలో ఎక్కువ సోర్స్ ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. రకరకాల పోర్టులు ఉన్నాయి. ఆ నాయకులంతా ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాణా వైపు చూడొద్దని హితవు పలికారు. తెలంగాణలో విద్వేషాలకు ప్రయత్నించవద్దని తెలిపారు. తెలంగాణ లో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందని, ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. రైతులు వరి , పత్తి తప్ప ఏ పంటలు పండించడం లేదని వివరించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

**ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం**
**అఖిలపక్ష భేటీలో కమిటీ ఛైర్మన్ కేశవరావు**

హైదరాబాద్,జూన్ 4 (జై భీమ్ న్యూస్): తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ పక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

# దేశానికి యువతే ప్రాణం

**యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా**
**ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి**

**అమరావతి,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్‌పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు.

# సూడాన్ ప్రయాణికుడికి ఎబోలా లక్షణాలు

## తోనమే గాంధీ ఆస్పత్రికి తరలింపు

**హైదరాబాద్,జూన్ 4 (జై భీమ్ న్యూస్) :**

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. గురువారం సూడాన్ నుంచి నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి.. ఎయిర్‌పోర్టులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహించారు. ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించిన వైద్య సిబ్బంది వెంటనే అప్రమత్తయ్యారు. వెంటనే అతన్ని గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి సీసీఎంబీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు సైకిల్ వినియోగం

**ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి**

**అమరావతి,జూన్ 4 (జై భీమ్ న్యూస్):**

జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగించాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్‌పై వెళ్లనున్నారు. పర్యావరణ హితమైన సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పార్టీ నేతలతోపాటు ప్రభుత్వంలో పని చేసే వారంతా శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా గురువారం ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. 'రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు? ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ -సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

జై భీమ్ POWER OF PEOPLE

# పొత్తుతో వస్తారా.. ఒంటరిగా వస్తారా? పవన్‌పై ప్రకాశ్ రాజ్ వ్యంగ్యం


**తెలంగాణలో జనసేన పోటీపై సోషల్ మీడియాలో చర్చ**
**'వస్తానంటే వద్దంటామా' అంటూ ప్రకాశ్ రాజ్ ట్వీట్**
**చజీబర్‌ూంఎఱఅస్త్ర హ్యాష్‌ట్యాగ్‌తో పరోక్ష వ్యాఖ్యలు**
**కౌంటర్లతో స్పందిస్తున్న జనసేన అభిమానులు**
**తెలంగాణ రాజకీయాల్లో జనసేన ఎంట్రీపై ఆసక్తి**



ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తెలంగాణ రాజకీయాల్లోకి జనసేన అడుగుపెట్టనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో జనసేన పార్టీ పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ప్రకాశ్ రాజ్ తన ఎక్స్ ఖాతా ద్వారా పరోక్షంగా స్పందించారు. పవన్ పేరును ప్రస్తావించకుండా, "వస్తానంటే వద్దంటామా.. రండి సార్. కానీ అంతకంటే ముందు ఒకటి చెప్పండి. మీరు పొత్తుతో వస్తున్నారా? లేక సింగిల్‌గా వస్తున్నారా? ఊరికే అడుగుతున్నా" అంటూ ట్వీట్ చేశారు. దీనికి తన సిగ్నేచర్ హ్యాష్‌ట్యాగ్ చజీబర్‌ూంఎఱఅస్త్రను జత చేశారు. ప్రకాశ్ రాజ్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జనసేన శ్రేణులు, అభిమానులు తీవ్రంగా స్పందిస్తున్నారు. తెలంగాణ రాజకీయాలపై వ్యాఖ్యానించే ముందు గత ఎన్నికల్లో బెంగళూరులో పోటీ చేసినప్పుడు ఎదురైన ఫలితాలను గుర్తు చేసుకోవాలని కొందరు నెటిజన్లు కౌంటర్లు ఇస్తున్నారు. మరోవైపు పవన్ కల్యాణ్ రాజకీయ నిర్ణయాలపై ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించాల్సిన అవసరం ఏమిటని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే, తెలంగాణలో జనసేన పార్టీ రాజకీయ వ్యూహం ఎలా ఉండబోతుందన్న అంశంపై కూడా చర్చ కొనసాగుతోంది. రాష్ట్రంలో పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందా? లేక ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి తరహాలోనే ముందుకు వెళ్తుందా? అన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రకాశ్ రాజ్ ట్వీట్‌తో తెలంగాణ రాజకీయాల్లో జనసేన ప్రవేశం అంశం మరోసారి సోషల్ మీడియా వేదికగా హాట్ టాపిక్‌గా మారింది.

# ప్రకాశ్‌రాజ్‌పై బండ్ల గణేశ్ ఘాటు విమర్శలు

**పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలకు కౌంటర్**
**ప్రతి విషయంలో జోక్యం చేసుకోవద్దంటూ హితవు**
**'ముందు నీ అడ్రస్ తెలుసుకో' అంటూ విమర్శ**
**సోషల్ మీడియాలో మాటల యుద్ధం**
**పవన్ రాజకీయ వ్యాఖ్యలతో మొదలైన వివాదం**



ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన సోషల్ మీడియా వ్యాఖ్యలపై టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ను ఉద్దేశించి ప్రకాశ్‌రాజ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఇద్దరి మధ్య సోషల్ మీడియాలో మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఇటీవల తెలంగాణ రాజకీయాలపై మాట్లాడిన పవన్ కల్యాణ్, రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తానని, భవిష్యత్తులో ఎన్నికల్లో కూడా పోటీ చేస్తానని వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన ప్రకాశ్‌రాజ్ 'ఎక్స్' వేదికగా వ్యంగ్యంగా స్పందిస్తూ, "మీరొస్తానంటే మేమొద్దంటామా?" అంటూ పోస్టు చేశారు. అలాగే "సింగిల్‌గా వస్తారా? లేక పొత్తులతో వస్తారా?" అంటూ ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలకు కౌంటర్‌గా బండ్ల గణేశ్ అదే సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. "ప్రతి విషయంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారు? అసలు మీరు ఎవరు? తమిళోడివా, తెలుగోడివా, కన్నడోడివా? ప్రతి అంశంపై వ్యాఖ్యానించాల్సిన అవసరం ఏముంది?" అంటూ ప్రశ్నించారు. అంతేకాకుండా "ముందు మీ అడ్రస్ ఏమిటో మీరు తెలుసుకోండి. తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయండి" అంటూ విమర్శలు గుప్పించారు. ప్రతి విషయంపై స్పందిస్తూ తీర్పులు చెప్పడం సరైన పద్ధతి కాదని వ్యాఖ్యానించారు. ప్రకాశ్‌రాజ్, బండ్ల గణేశ్ మధ్య సోషల్ మీడియాలో జరిగిన ఈ వ్యాఖ్యల పరంపర ఇప్పుడు సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పవన్ కల్యాణ్ రాజకీయ వ్యాఖ్యలతో ప్రారంభమైన ఈ వివాదం మరింత ముదురుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.







# తిరుమలలో జాన్వీ కపూర్ ప్రత్యేక దర్శనం

**'పెద్ది' సినిమా విడుదల సందర్భంగా శ్రీవారిని దర్శించుకున్న నటి**
**కజిన్ మహేశ్వరితో కలిసి తిరుమల పర్యటన**
**శ్రీవారి ఆశీస్సులు పొందిన బాలీవుడ్ నటి**
**ఆలయ మర్యాదలతో స్వాగతం**
**సినిమా విజయవంతం కావాలని ప్రత్యేక ప్రార్థనలు**

బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తన తాజా చిత్రం 'పెద్ది' విడుదల సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు. ఆమెతో పాటు కజిన్ మహేశ్వరి కూడా ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఉదయం వీఐపీ విరామ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్న జాన్వీ కపూర్ ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. సినిమా విజయవంతం కావాలని ఆమె ప్రత్యేకంగా ప్రార్థించినట్లు సమాచారం. దర్శనం అనంతరం ఆలయ అధికారులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. జాన్వీ కపూర్‌ను చూసేందుకు అభిమానులు ఆసక్తి కనబరిచారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమా విడుదల నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉండగా, ఈ సందర్భంగా జాన్వీ కపూర్ తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది.

# ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ ప్రత్యేక శుభాకాంక్షలు

స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం వీరిద్దరి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'డ్రాగన్' చిత్రాన్ని ప్రస్తావిస్తూ ఎన్టీఆర్ చేసిన పోస్ట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. తన సోషల్ మీడియా ఖాతాలో ఎన్టీఆర్ స్పందిస్తూ.. "పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్" అని పేర్కొన్నారు. ఈ పోస్టులో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి కన్నడ పదమైన 'అవరే' అనే సంబోధనను ఉపయోగించడం తెలుగు, కన్నడ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల మధ్య చర్చనీయాంశంగా నిలిచింది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి భారీ విజయాలతో భారతీయ సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్‌తో కలిసి చేస్తున్న 'డ్రాగన్' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా గురించి వచ్చే ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఎన్టీఆర్ చేసిన తాజా పోస్ట్‌తో 'డ్రాగన్' ప్రాజెక్ట్ మరోసారి సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారగా, ఈ క్రేజీ కాంబినేషన్ నుంచి భారీ విజయాన్ని అభిమానులు ఆశిస్తున్నారు.



# బన్నీ-లోకేశ్ మూవీపై కీలక అప్‌డేట్.. ఊపిరి పీల్చుకున్న ఫ్యాన్స్

**అల్లు అర్జున్-లోకేశ్ కనగరాజ్ కాంబోలో రానున్న ూూ23 ఆగిపోలేదని వివరణ**
**సోషల్ మీడియా పోస్ట్ ద్వారా వదంతులకు చెక్ పెట్టిన రచయిత రత్నకుమార్**
**ఈ ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నానంటూ తన పోస్ట్‌లో వెల్లడి**
**షెడ్యూల్ సమస్యల కారణంగా ప్రాజెక్ట్ ఆగిపోయిందంటూ ఇటీవల ప్రచారం**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా రాబోతున్న పాన్-ఇండియా చిత్రం (ూూ23) ఆగిపోయిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని రచయిత రత్నకుమార్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం కొనసాగుతోందని, దానిపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఆయన తేల్చిచెప్పారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'విక్రమ్' సినిమా విడుదలై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జూన్ 3న రత్నకుమార్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ (ూజఖ)లో భాగమైనందుకు గర్వంగా ఉందని తెలుపుతూ, పోస్ట్ చివర్లో "చూూ23 కోసం వేచి ఉండలేను" అని రాసుకొచ్చారు. దీంతో ఈ ప్రాజెక్ట్ పై వస్తున్న పుకార్లకు ఆయన ఒక్క పోస్ట్‌తో చెక్ పెట్టారు. 2026 ప్రారంభంలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అనిరుధ్ రవిచందర్ సంగీతంతో వచ్చిన టీజర్ భారీ అంచనాలు క్రియేట్ చేసింది. అయితే, షెడ్యూల్ సమస్యలు లేదా క్రియేటివ్ విభేదాల కారణంగా ఈ సినిమాను పక్కన పెట్టారని ఇటీవల సోషల్ మీడియాలో కొన్ని నిరాధారమైన వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దీంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో' వంటి చిత్రాలకు సహ రచయితగా పనిచేసిన రత్నకుమార్, ఈ సినిమా స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని గతంలోనే తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఈ కథాంశంపై అల్లు అర్జున్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని పేర్కొన్నారు. తాజా స్పష్టతతో ఈ వదంతులు పూర్తిగా నిరాధారమైనవని ట్రేడ్ వర్గాలు కూడా అంటున్నాయి. 2027లో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు మళ్లీ పెరిగాయి. ఈ వార్తతో అల్లు అర్జున్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

